## క్లుప్తంగా

### సుబ్రహ్మణ్యేశ్వరుడికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

**వేంపల్లె :** స్థానిక గాండ్ల వీధిలో వెలసిన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుస్వామికి విశేష పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు శేషగిరిరావు తెలిపారు. శుక్రవారం కార్తీక మాస నాగల చవితి పండుగ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఉన్న పుట్టకు పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు సాంబ శివుడు, రాఘవరెడ్డి భక్తులు పాల్గొన్నారు.

### 'ఆడుదాం ఆంధ్ర'పై శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీడీఓ రంతుల్లయ్య

**ఎర్రగుంట్ల :** మండల పరిషత్తు కార్యాలయ సభా భవనంలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు శిక్షణ తరగతులను ఎంపీడీఓ రంతుల్లయ్య, తహసీల్దార్ ఎ.నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ శివప్రసాద్, జిల్లా స్పోర్ట్స్ అధికారులు, పిజికల్ డైరెక్టర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

### రద్దు చేసిన పథకాలను అమలు చేయాలి

**పులివెందుల టౌన్ :** ఎస్సీ కార్పొరేషన్‌లో రద్దు చేసిన 26 పథకాలను వెంటనే అమలు చేయాలని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డికి బీజేపీ నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఆదేశాల మేరకు బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గుడిసె దేవానంద్ నాయకత్వంలో బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు స్థానిక సీఎం క్యాంపు కార్యాలయంలో ఉన్న ఓఎస్డీని కలిశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### విష పురుగులు రాకుండా చర్యలు తీసుకోవాలి

**వేంపల్లె :** ట్రిపుల్ ఐటీలోకి విష పురుగులు రాకుండా చర్యలు తీసుకోవాలని పులివెందుల సమన్వయ కమిటీ సభ్యులు ధ్రువకుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ట్రిపుల్ ఐటీ ఆవరణలో గడ్డి పెరిగిపోవడంవల్ల విష పురుగులు వస్తున్నాయని.. సిబ్బంది ఎంచేస్తున్నారన్నారు. గతంలో కూడా విష పురుగులు రావడం జరిగిందన్నారు. విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరిగినా పూర్తి బాధ్యత డైరెక్టర్ వహించాల్సి వస్తుందన్నారు.

### కన్యతీర్థం ముగ్గులతో ముస్తాబు

**జమ్మలమడుగు రూరల్ :** పవిత్ర కార్తీక మాసం సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన కన్యతీర్థంలో భక్తులు వివిధ రంగుల ముగ్గులతో ముస్తాబు చేస్తున్నారు. శుక్రవారం ఆర్టీపీపీకి చెందిన బాలన్నగారి కుమారి ఆధ్వర్యంలో మహిళలు 15 రోజుల నుంచి ఆలయ పరిసర ప్రాంతాల్లో ఆకర్షణీయంగా ముగ్గులను వేస్తున్నారు. ఆలయంలో దాదాపు 50 రకాల ముగ్గులను వేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.

### ఆకట్టుకున్న గీతాలాపన



కన్యతీర్థం ఆలయ ఆవరణలో మహిళలు వేసిన ముగ్గు

**ప్రొద్దుటూరు కల్చరల్ :** స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో నామా ఎరుకలయ్య, కమలమ్మ ఆరాధన మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రిజీ సరిగమ ఫేమ్ పార్వతి ఆలపించిన గీతాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఆమె అన్నమాచార్య కీర్తనలు, భక్తి పాటలు ఆలపించి అందరిని అలరించారు. ఎర్రగుంట్లకు చెందిన నడిఊరు రామాలయం భజన బృందం తాళాల హరి భజన చేశారు.

### దీక్షను జయప్రదం చేయండి

**ప్రొద్దుటూరు :** కృష్ణా జలాల పునఃపంపిణీకి వ్యతిరేకంగా ఈనెల 27, 28న విజయవాడలో చేపట్టే 30 గంటల దీక్షలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర తెలిపారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సమితి సభ్యులు రామకృష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గాలి చంద్ర మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెలంగాణాలో జరిగే ఎన్నికల దృష్ట్యా రాజకీయ లబ్ధి కోసం కృష్ణా జలాలను తెలంగాణ వారికే పూర్తి హక్కులు అన్నట్లు ఇవ్వడం దుర్మార్గమన్నారు. జిల్లా వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# త్వరగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి



అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, తదితరులు

**పులివెందుల టౌన్ :** డిసెంబర్ నెలాఖరులోగా పులివెందుల మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులు పూర్తి చేయాలని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న పులివెందులను అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇచ్చిన పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. అనంతరం పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి కన్ఫర్డ్ ఐఏఎస్ అధికారిగా పదోన్నతి లభించడంతో మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ ఆయనను ఘనంగా సత్కరించారు.

**ప్రమాద బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం :** పులివెందుల మున్సిపాలిటీలో పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్(ఆప్కోస్) విధి నిర్వహణ సమయంలో ప్రమాదవశాత్తు మరణించిన ఇద్దరు పబ్లిక్ హెల్త్ వర్కర్లకు రూ.5లక్షల నగదును వారు బాధిత కుటుంబాలకు అందజేశారు. సాధారణంగా మరణించిన 7 మంది పబ్లిక్ హెల్త్ వర్కర్లకు ఒక్కొక్కరికి రూ.2లక్షల చొప్పున మొత్తం రూ.24లక్షలు వారు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

# సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలి



బాధితులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి

**జమ్మలమడుగు :** ముఖ్యమంత్రి నుంచి వచ్చిన సహాయనిధి చెక్కులను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ మూలే సు. ధీర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. లబ్ధిదారులకు చికిత్స అనంతరం ముఖ్యమంత్రి నుంచి వచ్చిన సహాయ నిధి లబ్ధిదారులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. లబ్ధిదారులు వృథా చేసుకోకుండా వినియోగించుకోవాలన్నారు. 7 మంది లబ్ధిదారులకు రూ.5 లక్షల 29 వేలు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు.

# ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు



పంటలను పరిశీలిస్తున్న పీడీ ఆనంద్‌నాయక్

**పెండ్లిమర్రి :** రైతులు పంటల సాగు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చునని డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్ తెలిపారు. శుక్రవారం మండలంలోని చెన్నంరాజుపల్లె గ్రామ పొలాల్లో ప్రకృతి వ్యవసాయంతో సాగు చేసిన పంటలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం తక్కువ ఖర్చుతో అధిక దిగుబడు సాధించవచ్చునన్నారు. ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపేలా వారిని ప్రోత్సహించాలన్నారు. అనంతరం మోడల్ విజన్ బిల్డింగ్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ ప్రాజెక్టు మేనేజర్ వసంతకుమారి, ఏరియా కోఆర్డినేటర్ రఘునాథ్‌రెడ్డి, డీపీఎం హరిప్రసాద్, ఏపీఎం వెంకటేశ్వర్లు, సీసీలు పాల్గొన్నారు.

# లక్కీడిప్ ద్వారా విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులను అందిస్తున్న ఆర్టీసీ అధికారులు

**పులివెందుల రూరల్ :** పులివెందుల ఆర్టీసీ డిపో పరిధిలో కడప–పులివెందుల, పులివెందుల–కడప పల్లె వెలుగు బస్సులలో ప్రయాణించే ప్రయాణీకులకు ఆర్టీసీ సంస్థ బహుమతులు ప్రదానం చేస్తోంది. పల్లెవెలుగు బస్సులలో ప్రయాణించే ప్రయాణీకులలో ముగ్గురిని విజేతలుగా ఎంపిక చేసి వారికి శుక్రవారం నూతనంగా నిర్మించిన ఆర్టీసీ బస్టాండులో ఆర్టీసీ ఇన్‌చార్జి డీఎం గోవర్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు బహుమతులను ప్రదానం చేశారు. మొదటి బహుమతిని వేంపల్లెకు చెందిన ప్రభావతి, రెండవ బహుమతి అలవలపాడుకు చెందిన దేవదత్తం, మూడవ బహుమతి వీరపునాయునిపల్లెకు చెందిన ప్రభావతిలకు లక్ష్మీవెంకటేశ్వర మెడికల్ స్టోర్ డాక్టర్ చంద్రలేఖ సౌజన్యంతో బహుమతులను అందజేశారు.

### ఉమ్మడి బ్యాంక్ ఖాతా తెరవాలి

**సింహాద్రిపురం :** జగనన్న విద్యా దీవెన, వసతి దీవెనకు అర్హులైన విద్యార్థులు తల్లితో కలిసి ఈనెల 24వ తేదీలోపు ఉమ్మడి బ్యాంక్ ఖాతా తెరవాలని.. ఎస్సీ విద్యార్థులు, చివరి సంవత్సరం చదివే వారు ఈ ఖాతా తెరవాల్సిన అవసరం లేదని ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఖాతా తెరిచాక ఆ వివరాలను తమ పరిధిలోని సచివాలయాలకు తెలియజేయాలని.. ఉమ్మడి బ్యాంక్ ఖాతా అకౌంట్ పుస్తకంలోని మొదటి పేజీ కాపీని అందించాలన్నారు. నాల్గవ విడత విద్యా దీవెన పథకం నగదు విడుదలకు ఈ ప్రక్రియ తప్పనిసరి అన్నారు. సచివాలయ సిబ్బంది ఉమ్మడి బ్యాంక్ ఖాతా వివరాలను నవశకం లాగింగ్‌లో అప్‌డేట్ చేస్తారన్నారు. ఖాతాలు తెరిచే విషయంలో తల్లిదండ్రులు, కళాశాల ప్రిన్సిపాల్స్, సచివాలయ సిబ్బంది, బ్యాంక్ మేనేజర్లు సహకరించాలన్నారు.

### రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

**పులివెందుల :** పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతి కుమార్ మెదడు, వెన్నుముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె జబ్బులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

### బెల్ట్‌షాపులపై ఉక్కుపాదం

**కడప వైఎస్ఆర్ సర్కిల్:** జిల్లాలోని బెల్ట్‌షాపులపై ఉక్కుపాదం మోపుతామని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ఎక్కడ కూడా అక్రమ మద్యం లేదన్నారు. గ్రామాల్లోని బెల్ట్‌షాపులపై నిఘా ఉంచామన్నా రు. ప్రభు త్వం మద్యం దుకాణాలపై నిరంత రం నిఘా ఉంటుందన్నారు. జిల్లాలో మద్యా న్ని ఎంఆర్‌పీ ధరలకు అమ్ముతున్నామన్నారు.

### రేపు బ్యాడ్మింటన్ పోటీలు

**ప్రొద్దుటూరు కల్చరల్ :** స్థానిక జార్జికొరొనేషన్ క్లబ్‌లోని వర్రా గురివిరెడ్డి ఇండోర్ స్టేడియంలో ఆదివారం ఉదయం 9 గంటలకు బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించనున్నట్లు క్లబ్ సెక్రటరీ గంగిరెడ్డి, కోచ్ అనిల్ ఒక ప్రకటనలో తెలిపారు. మెన్స్ డబుల్ విభాగంలో పోటీలు ఉంటాయన్నారు. ప్రథమ బహుమతి రూ.5000, ద్వితీయ బహుమతి రూ.3000, తృతీయ, చతుర్థి బహుమతి రూ.1500 అందిస్తామని ఆయన పేర్కొన్నారు. వివరాలకు 83282 65835 సంప్రదించాలని కోరారు.

# మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలి



బాధ్యతలు చేపట్టిన మెప్మా సీఎంఎం రాజేశ్వరి

**పులివెందుల రూరల్ :** మహిళలు అన్ని రంగాలలో రాణించి అభివృద్ధి చెందాలని మెప్మా సీఎంఎం రాజేశ్వరి తెలిపారు. పులివెందుల మెప్మా సీఎంఎంగా ఉన్న గంగులయ్య జమ్మలమడుగుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రాజంపేట మెప్మాలో సీఎంఎంగా పనిచేస్తున్న రాజేశ్వరి బదిలీపై పులివెందులకు వచ్చి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పులివెందుల మున్సిపాలిటీలోని పొదుపు సంఘాల మహిళలు బ్యాంక్‌ల ద్వారా తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలన్నారు. మహిళల సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో మెప్మా సీఓ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

**జమ్మలమడుగు :** ఉప్పలపాడు జిల్లా పరిషత్ పాఠశాల నుంచి ఆరు మంది రాష్ట్రస్థాయిలో జరిగి వివిధ రకాల ఆటలపోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జరినాబేగం తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 11వ తేదీన కాకినాడ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల పోటీలు పిఠాపురంలో జరిగాయి. సాఫ్ట్‌టెన్నిస్ అండర్–14 విభాగంలో వరుస్‌కుమార్ మూడో స్థానంలో, అండర్–17 త్రోబాల్ పోటీలో అనుష్‌కుమార్, బాలికల విభాగంలో బ్యూలా ప్రతిభ చూపినట్లు తెలిపారు. వీరు అనంతపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. అలాగే నంద్యాలలో జరుగనున్న అండర్–14 విభాంగా స్వీటి, బ్లెస్సీ, బాలుర విభాగంలో రోహిత్‌కుమార్‌లు కడప జిల్లా జట్టు తరపున ఆడుతున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపా. కార్యక్రమంలో వ్యాయమా ఉపాధ్యాయురాలు అబీదాబీ విద్యార్థులు పాల్గొన్నారు.

# సమస్యలను పరిష్కరించాలని వినతి



ఆర్టీపీపీ సీఈ నాగరాజుకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

**ఎర్రగుంట్ల :** ఆర్టీపీపీలోని కమిటీ హాల్‌ను రిపేర్ చేయించాలని అలాగే వివిధ సమస్యలపై వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు శుక్రవారం ఆర్టీపీపీ సీఈ నాగరాజును కలిసి యూనియన్ తరుపున వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఆర్టీపీపీకి ప్రొద్దుటూరుకు వేళ్లే రోడ్డుకు మరమ్మతులు చేయాలని, ఆర్టీపీపీలో దోమల బెడద అధికంగా ఉందని, ఆర్టీపీపీ ప్రాజెక్టులోని ఆసుపత్రిలో ప్రతి ఒక్కరికి మందులు, మెడికల్ పరికరాలు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ స్టేట్ ప్రెసిడెంట్ జీ మహేశ్వరరెడ్డి, రిజినల్ ప్రెసిడెంట్ వి.రామయ్య, రిజినల్ సెక్రటరీ ఎస్.మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటా దిశా యాప్ రిజిష్టర్



దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తున్న మహిళా పోలీసులు, సిబ్బంది

**లింగాల :** మండలంలో దిశా యాప్‌పై మహిళా పోలీసులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. శుక్రవారం పార్నపల్లె గ్రామంలో ఇంటింటా మహిళలకు దిశ యాప్‌పై అవగాహన కల్పిస్తూ వారి సెల్ ఫోన్లలో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. మహిళా పోలీసు వరలక్ష్మి హెల్ప్‌లైన్ నెంబర్లను, సేఫ్టీ ప్లేసెస్‌పై మహిళలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా లింగాల పోలీస్‌స్టేషన్ వద్ద మహిళా పోలీసులు ప్రయాణీకులకు ఆపి వారి సెల్‌ఫోన్లలో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. ఎంఎల్‌హెచ్‌పీ గాయత్రి, ఏఎన్ఎంలు శ్యామల, ఆశా వర్కర్లు సునంద, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

### క్రీడల్లో సత్తాచాటాలి



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థితో ఉపాధ్యాయులు

**జమ్మలమడుగు రూరల్ (మైలవరం) :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో సత్తా చాటినప్పుడే వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. గురువారం కడపస్పోర్ట్స్ పాఠశాలలో జిల్లా స్థాయిలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో డి.నరేంద్ర జావలిన్ త్రోలో జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికై నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు



రథోత్సవంలో అయ్యప్పస్వామి

**ప్రొద్దుటూరు కల్చరల్ :** స్థానిక పెన్నానదీతీరంలోని శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. అయ్యప్ప స్వామి మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో అయ్యప్పస్వామి ఉత్సవ మూర్తిని రథంపై ఉంచి ఊరేగించారు. లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, శ్రీధర్మశాస్త హోమాన్ని నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. పలువురు భక్తులు అయ్యప్పస్వామి దీక్షను స్వీకరించారు.

# ఘనంగా ప్రతిష్ట ఉత్సవాలు ప్రారంభం

**బ్రహ్మంగారిమఠం :** మండల కేంద్రమైన బ్రహ్మంగారి మఠంలో శ్రీ పోలేరమ్మవారి ఆలయ జీర్ణోద్దరణ, విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రత్యేకంగా యాగశాల ఏర్పాటు చేసి, హోమాలు నిర్వహించారు. గణపతి పూజ, అభిషేకాలు, అఖండ ప్రతిష్టాపన, ప్రధాన కలశ స్థాపన, పరివార దేవతార్చనలు తదితర కార్యక్రమాలు నిర్వహించి, అంకురార్పణ చేశారు. శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి మఠం పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరభోగ వసంత వేంకటేశ్వర స్వామి కుమారులు శ్రీ ఎస్.వెంకటాద్రిస్వామి, శ్రీ ఎస్.వీరభద్రస్వామి, ఎస్.వీరంభట్లయ్యస్వామి, ఎస్.దత్తాత్రేయస్వామి ఉత్సవాలు ప్రారంభించారు.

శతాధిక ప్రతిష్టాపనాచార్య, గుంటూరు జిల్లా తెనాలికి చెందిన ఇడమకంటి జనార్ధన శివాచార్య ఆధ్వర్యంలో వేలూరుకు చెందిన జ్యోతి మురుగాచార్య, పోలేపల్లె రామబ్రహ్మం, యలవర్తి ఆంజనేయశాస్త్రి వేద సంస్కృత పాఠశాల పూర్వపు శిష్య బృందం, మఠం ఆలయ అర్చకులు ఉదయం, సాయంత్రం విశేష పూజలు చేశారు. తిరుపతి జిల్లా వెంకటగిరికి చెందిన శ్రీ నటరాజ నాట్య కళాబృందం వారు నిర్వహించిన ×శ్రీ సిద్ధయ్యగారి జ్ఞానంమార్గం సాంస్కృతిక కార్యక్రమం భక్తులను అలరించింది.

శ్రీ పోలేరమ్మవారి విగ్రహాన్ని ప్రొద్దుటూరు నుంచి బ్రహ్మంగారిమఠానికి తెచ్చి శ్రీవీరబ్రహ్మేంద్రస్వాముల వారి మఠంలోని గణపతి మంటపంలో గురువారం రాత్రి ధాన్యంలో ఉంచారు. శుక్రవారం ఉదయం పోలేరమ్మ గుడి వద్దకు తీసుకొచ్చి పూజా కార్యక్రమాల్లో కొలువు దీర్చారు. రాత్రి భక్తుల సమక్షంలో జలాధివాస కార్యక్రమం నిర్వహించారు. శనివారం ఉదయం ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

### వేతనాలు చెల్లించాలి

**ప్రొద్దుటూరు :** మున్సిపల్ క్లాప్ వాహన డ్రైవర్లకు బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ పేర్కొన్నారు.
శుక్రవారం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ పి.పద్మావతిని కలిసి వేతన బకాయిలు చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తారన్న ఆశతో రూ.10వేలు డిపాజిట్ చెల్లించి క్లాప్ డ్రైవర్లు విధుల్లో చేరారని తెలిపారు. తక్కువ వేతనాలతో వారు కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### రిమ్స్ మార్చురీలో గుర్తు తెలియని మృతదేహం

**కడప అర్బన్:** కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో శుక్రవారం తెల్లవారుజామున తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న గుర్తు తెలియని వ్యక్తిని చేర్పించారు. సర్జికల్ ఐసీయూ వార్డులో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందగా మార్చురీలో వుంచారు. ఎవరైనా ఆచూకీ తెలిసిన వారు తమను సంప్రదించాలని రిమ్స్ సిబ్బంది కోరారు..

### హెచ్ఐవీ పట్ల అవగాహన ఉండాలి

**వైవీయూ :** హెచ్ఐవీ/ఎయిడ్స్ పట్ల యువత అవగాహన కలిగి ఉండాలని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆర్ట్స్ కళాశాలలో ఏపీ ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జిల్లాస్థాయి రెడ్ రిబ్బన్ క్లబ్స్, యూత్ అవేర్‌నెస్ మాస్టర్స్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్, జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి డా. ఎస్. రవిబాబు మాట్లాడుతూ హెచ్ఐవీ/ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

అనంతరం శిక్షణలో పాల్గొన్న అధ్యాపకులకు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. కార్యక్రమంలో రెడ్ రిబ్బన్ క్లబ్ జిల్లా కోఆర్డినేటర్ డా. పి. నాగరాజు, డీపీఎం భాస్కర్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

# గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



సీకేదిన్నెలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్న దృశ్యం



పులివెందులలో చిత్రలేఖన పోటీలలో విద్యార్థులు



వేంపల్లెలో లెమన్ స్పూన్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు



ఎర్రగుంట్లలో గ్రంథాలయ వారోత్సవాలను పరిశీలిస్తున్న కమిషనర్ పి.జగన్నాథ్

**కమలాపురం :** గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారిణి ఎస్.నాగాంజలి తెలిపారు. ఈనెల 14వ తేదీ నుంచి జరుగుతున్న 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం స్థానిక వివేకానంద హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

**విద్యార్థులకు వ్యాసరచన పోటీలు**

**చింతకొమ్మదిన్నె :** సీకేదిన్నె శాఖ గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. శుక్రవారం సీకేదిన్నె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గ్రంథాలయ అధికారి పి.ఇబ్రహీం ఆధ్వర్యంలో 6, 7 తరగతి విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. దాదాపు 73 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే నేడు 8, 9వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఉంటాయన్నారు. 20వ తేదీ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు రోజు విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు. ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**చిత్రలేఖన పోటీలకు విశేష స్పందన**

**పులివెందుల టౌన్ :** పట్టణ పరిధిలోని సత్రంబడి పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన చిత్రలేఖన పోటీలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని లైబ్రేరియన్ కిరణ్ ఆధ్వర్యలలో ఈ పోటీలను ఏర్పాటు చేశారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు రోజున విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ గంగిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**విద్యార్థులకు ముగ్గుల పోటీలు**

**వేంపల్లె :** జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారిణి వనజకుమారి తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 9, 10వ తరగతుల విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అలాగే మెయిన్ బజార్‌లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పరుగు పందెం, లెమన్ స్పూన్, బుక్ బ్యాలెన్స్ తదితర పోటీలు నిర్వహించారు. పాఠశాల హెడ్మాస్టర్ రాజేశ్వరి, నాగమునెమ్మ, విశ్రాంత ఉపాధ్యాయులు వెంకటరామిరెడ్డి, ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థులకు ఉపన్యాస పోటీలు**

**లింగాల :** దిగువ లింగాల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హెడ్మాస్టర్ పద్మావతి హాజరై ఆటల పోటీలను వీక్షించారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు రోజున బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. అలాగే గ్రంథాలయ ఆవశ్యకత గురించి పిల్లలు చక్కగా మాట్లాడారు.

**విద్యార్థులకు టాలెంట్ టెస్టుపోటీలు**

**జమ్మలమడుగు :** స్థానిక ప్రభుత్వ గ్రంథాలయంలో వారోత్సవాలలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వ్యాసరచన, టాలెంట్ టెస్టు పోటీలతోపాటు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. పట్టణంలోని 18 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఈనెల 20వ తేదిన బహుమతులను ప్రధానం చేస్తామని గ్రంథాలయ అధికారి జింకా చంద్రశేఖర్ తెలిపారు.

**విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు**

**ఎర్రగుంట్ల :** పట్టణంలోని ప్రభుత్వ గ్రంథాలయంలో శుక్రవారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్ పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులతో పాటు గ్రంథాలయ రికార్డు అధికారి ఉమాదేవి పాల్గొన్నారు.